నేటి కందం- నేటికి అందం

పోర్చుగలు దేశ మందున
మార్చుచు పలు పద్ధతులను మానవులకు-చే
కూర్చ ప్రజాస్వామ్యము-పో
కార్చగ చెడుగులను నేను కరములు మోడ్తున్ !!

(5-10-1910 పోర్చుగల్ లో ప్రజాస్వామ్య స్థాపన)

-రాధశ్రీ
సెల్:9494481210




# నేటి నిజం
తెలుగు దినపత్రిక


website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com



చురక

బూతు భాష శ్రుతిరాగం
పల్లవించి పాడుతుంది
బజార్లల్లో ట్రోలింగయి
బట్టలిప్పి ఆడుతుంది
అధికారం విపక్షాల్లో
అదే మురికి మూసి నోరు
ప్రక్షాళన జరగకుంటే
పరువులింకా దిగజారు

-వేల్పుల నారాయణ
9440433475





హైదరాబాద్ శనివారం 5-10-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:55 పేజీలు:6 వెల: రూ.1/-


## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..
# 30 మంది మావోయిస్టులు మృతి



ఛత్తీస్‌గఢ్ అక్టోబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఛత్తీస్‌గఢ్ లో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. నారాయణ్‌పూర్ దంతెవాడ సరిహద్దుల్లో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ రేంజ్‌లోని దంతెవాడ, నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో ఉండే అబూజ్‌మడ్ దండకారణ్యంలో మావోయిస్టులు నక్కి ఉన్నట్లు పోలీసులకు ముందుగా సమాచారం అందింది. దీంతో భద్రతా సిబ్బంది ఈ ప్రాంతంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో భద్రతా దళాలను చూసిన మావోలు కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన సిబ్బంది ఎదురుకాల్పులకు దిగి.. 30 మంది మావోలను మట్టుబెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనాస్థలం నుంచి భారీ ఎత్తున పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది.. కేంద్ర బలగాలు, చత్తీస్ గఢ్ పోలీసులతో కూడిన సంయుక్త కార్యాచరణ బృందం ఈ కాల్పుల్లో పాల్గొంది. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## తిరుపతి లడ్డు వివాదంపై సుప్రీం కోర్టు తాజా దర్యాప్తు

### -ఐదుగురు సభ్యులతో 'సిట్' ఏర్పాటు

న్యూఢిల్లీ అక్టోబర్ 4(ఎక్స్ ప్రెస్ న్యూస్ ): తిరుపతి లడ్డు వివాదంపై తాజా దర్యాప్తుకు సుప్రీంకోర్టు శుక్రవారం ఉత్తర్యవులు జారీ చేసింది. అంతేకాక ఐదుగురు సభ్యులతో కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. 'సిట్'లో సిబిఐ, ఆంధ్ర పోలీస్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఉంటారు.సిట్ విచారణను సిబిఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని కూడా సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయస్థానాన్ని "రాజకీయ యుద్ధభూమి"గా ఉపయోగించుకోడానికి అనుమతించబోమని న్యాయమూర్తులు బిఆర్.గవాయ్ , కెవి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అంశంపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌ల బ్యాచ్‌పై ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రయోగశాల పరీక్ష నివేదిక "అస్సలు స్పష్టంగా లేదు" అని సుప్రీం కోర్టు పేర్కొంది, "తిరస్కరించబడిన నెయ్యి" పరీక్షకు లోబడిందని ప్రాథమికంగా సూచించింది. రాష్ట్రం కథనం ప్రకారం సెప్టెంబర్ 25 న ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది, ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి సెప్టెంబర్ 26న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయడం జరిగింది.

## ఆర్తనాదాల మధ్య మునిగిపోయిన పడవ..
# 78 మంది జలసమాధి..



న్యూఢిల్లీ, అక్టోబర్ 4 : కాంగో లో ఘోర పడవ ప్రమాదం జరిగింది. దక్షిణ కివు ప్రావిన్స్‌లోని మినోవా పట్టణం నుంచి గోమా పట్టణానికి 278 మంది ప్రయాణికులతో బయలుదేరిన బోటు ఓవర్ లోడ్ కారణంగా గోమా తీరానికి కేవలం 100 మీటర్ల దూరంలో బోల్తా పడింది. కివూ సరస్సులో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో 78 మంది ప్రాణాలు కోల్పోయారు. మిగతా 200 మందిని రెస్క్యూ బృందాలు కాపాడాయి.

ఈ పడవ ప్రమాదంలో 78 మంది ప్రాణాలు కోల్పోయారు. మిగతా వారిలో కొందరు ఈదుతూ ఒడ్డుకు రాగా, కొందరిని రక్షణ దళాలు కాపాడాయని దక్షిణ కివు ప్రావిన్స్ గవర్నర్ జీన్ జాక్వెస్ పురుషి మీడియాకు తెలిపారు. అయితే మరణాలకు సంబంధించి కచ్చితమైన సంఖ్య తెలియడానికి మరో రెండు రోజులు పడుతుందన్నారు. ఎందుకంటే రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నదని, గల్లంతైన 78 మందిలో అందరి మృతదేహాలు లభ్యం కాలేదని అన్నారు.

కాంగో ప్రభుత్వ బలగాలకు, ఓ23 తిరుగుబాటుదారులకు మధ్య గత మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధం కారణంగా పలు రోడ్డు మార్గాలను మూసివేశారు. గోమాకు చేరుకోవడానికి చాలా మంది పడవలను ఆశ్రయిస్తున్నారు. దాంతో పడవలు కిక్కిరిసిన జనంతో రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో తాజా ప్రమాదం జరిగింది. కాగా యుద్ధమే ఈ ప్రమాదానికి కారణమని పలువురు మండిపడుతున్నారు.

# మూసీ అభివృద్ధి నిధి కింద వేయి కోట్ల కెటీఆర్ వేయి కోట్ల రూపాల లోన్లు

### - ఎవరెన్ని విమర్శలు చేసినా మూసీ నది ప్రక్షాళన జరిగి తీరుతుంది
### - స్పష్టం చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎవరెన్ని విమర్శలు చేసినా మూసీ నది ప్రక్షాళన జరిగి తీరుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. కెటిఆర్ మంత్రిగా ఉన్న సమయంలో మూసీ అభివృద్ధి నిధి కింద వేయి కోట్ల రూపాల లోన్లు తీసుకున్నారన్నారు. ఇప్పుడు తాము అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారని అన్నారు. హైదరాబాద్ లోని నోవాటెల్ లో శుక్రవారం నిర్వహించిన అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ సమయావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాచారం, జీడిమెట్ల వంటి ప్రాంతాల్లోని పరిశ్రమలు మూసీలో వ్యర్థాలను వదుతున్నాయన్నారు. మూసీ దుర్వాసన, మహమ్మారి రోగాలకు ప్రజలు బలవుతున్నారన్నారు. సబర్మతి, నమామి గంగే ప్రాజెక్టులు చేసినట్లు మూసీని ఎందుకు ప్రక్షాళన చేయకూడదని ప్రశ్నించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జిహెచ్ఎంసిని నాలుగు ప్రధాన కార్పొరేషన్లుగా విభజించబోతున్నా మన్నారు. కెసిఆర్ కాళేశ్వరం నిర్మిస్తే అది కాస్తా కూలిపోయి రూ. 2 లక్షల కోట్లు గంగపాలైందన్నారు. అయితే మూసీ సుందరీకరణకు రూ. 1.50 కోట్లా? అని అదే కెసిఆర్ ప్రశ్నిస్తున్నారన్నారు. కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారన్నారు. డిపిఆర్ సిద్ధం చేయకముందే కెటిఆర్ ఆరోపణలు చేయడం ఏమిటని నిలదీశారు. ఎట్టి పరిస్థితిలో మూసీ ప్రక్షాళన చేసితీరుతామన్నారు. రూ. 30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించబోతున్నామన్నారు. ఈ రోడ్డు తెలంగాణలో 50 శాతం కవర్ చేస్తుందన్నారు. రాబోయే నవంబర్ నెలలో టెండర్లను పిలుస్తామన్నారు. 100 ఎకరాల్లో కొత్త హైకోర్టు భవనాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో అన్నీ ఇక్కట్లే..

### -టీచింగ్ ఫ్యాకల్టీ లేక బోధనకు అవస్థలు
### -ఆరు వేల మంది బాలికలకు నలుగురే కేర్ టేకర్లు
### -చీఫ్ వార్డెన్ శ్రీధర్‌ను తొలగించాలి
### -ఎస్సీ, ఎస్టీ కమిషన్ ముందు విద్యార్థుల గోడు

ఆదిలాబాద్, అక్టోబర్ 4 : బాసర ట్రిపుల్ ఐటీలో ఏళ్ల తరబడి సమస్యలు ఎదుర్కొంటున్నా? పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ కమిషన్



ముందు గోడు వెళ్ళబోసుకున్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య నేతృత్వంలో కమిషన్ ఆకస్మికంగా బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించింది.

#### సమస్యలపై ఆరా..

వైస్ చాన్సలర్ వెంకటరమణతో కమిషన్ సమావేశమైంది. అనంతరం సమస్యలపై ఆరా తీసింది. వసతుల లేమి, టీచింగ్ ఫ్యాకల్టీ కొరత, కేర్ టేకర్ల కొరతపై కమిషన్ కు విద్యార్థులు ఏకరువు పెట్టారు. ఆరు వేల మంది విద్యార్థులకు కేవలం నలుగురు కేర్లు మాత్రమే ఉన్నారని, తమ సమస్యలు ఎవరికి చెప్పినా అర్థం కావని కమిషన్ ముందు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. చీఫ్ వార్డెన్ శ్రీదర్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు.

#### చీఫ్ వార్డెన్ శ్రీధర్ ను విధుల నుంచి తొలగించాలి..

తాము ముందస్తు సమాచారం ఇచ్చినా సమావేశానికి చీఫ్ వార్డెన్ శ్రీధర్ గైర్హాజర్ కావడం పట్ల ఎస్సీ, ఎస్టీ కమిషన్ సీరియస్ అయ్యింది. ఆయన్ను వెంటనే విధుల నుండి తొలగించాలని వైస్ ఛాన్సర్ కు సూచించింది. ఆరు వేల మంది బాలికలకు నలుగురు మాత్రమే కేర్ టేకర్లు ఉండటంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేర్ టేకర్లను వెంటనే పెంచాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

#### టీచింగ్ ఫ్యాకల్టీ లేక..

విద్యార్థులకు సరిపడా ఫ్యాకల్టీ లేకపోవడంతో ఉన్నత విద్యలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వాపోయారు. ప్రభుత్వం ఫ్యాకల్టీ నియామకాలపై కసరత్తు చేస్తుందని ఇంఛార్జ్ వీసీ వెంకటరమణ కమిషన్‌కు వివరించారు. వీలైనంత త్వరగా ఈ సమస్య తీర్చాలని, వారి చదువులకు ఆటంకం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ సూచించింది.

# రైతుల కోసం శ్రమిస్తున్న సీఎం - మంత్రి తుమ్మల

కామారెడ్డి, అక్టోబర్ 4 : మా ప్రభుత్వం రైతు రాజ్యమని, రైతుల కోసం సీఎం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లాలో వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకోకుండా ఇప్పుడు రుణామాఫీ గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రైతన్నల ఆదరణతో కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిందన్న ఆయన ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. రుణమాఫీ రైతు భరోసా.. రైతు బీమాను అమలు చేస్తామన్నారు. రెండు లక్షల వరకు లోన్ ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామన్నారు. సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ.. అర్హులందరికి ఇస్తామని చెప్పారు.

#### రుణ మాఫీ ఆందోళన వద్దు

రుణ మాఫీ విషయంలో ఎవరూ ఆందోళన చెంద వద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేవలం తెలంగాణలో కోటి 45 లక్షల టన్నుల వరిధాన్యాన్ని పండిస్తున్నారని.. ప్రతి రైతును ఆదుకొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారన్నారు. ప్రస్తుత సీజన్ లో ఎక్కువగా సన్నధాన్యాన్ని పండించారని.. అదనంగా రూ. 500 ఇచ్చి సన్నధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.

## కొల్లూరు చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృతి

హైదరాబాద్, అక్టోబర్ 4 : ప్రమాదశాత్తు కొల్లూరు చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందిన సంఘటన శుక్రవారం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పిల్లల మృతదేహాలను వెలికి తీశారు. మృతులు ముదుచింతల పల్లి మండలం కొల్లూర్ గ్రామానికి చెందిన కటిక మణికంఠ (14), సలేంద్రి హర్ష (10), మనోజ్ (8) లుగా పోలీసులు గుర్తించారు. ముగ్గురు పిల్లలు 15 సంవత్సరాల లోపు వారని తెలిపారు. పిల్లల మృతితో కొల్లూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసుకొని జీనోమ్ వ్యాలీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విచారణకు హాజరైన కవిత

హైదరాబాద్, అక్టోబర్ 4 : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌పై నేడు శుక్రవారం ఢిల్లీలోని రోస్ ఆఫ్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆమ్ ఆద్మీ పార్టీ నేత దుర్గేష్ పాఠక్, విజయ్ నాయర్ కోర్టులో వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అయితే ఈ కేసు విచారణను కోర్టు వాయిదా వేసింది.కాగా, తదుపరి విచారణ అక్టోబర్ 19 వరకు కోర్టు వాయిదా పడింది. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవిత, ఆమ్ ఆద్మీ పార్టీ నేత మనీష్ సిసోడియా, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వంటి తదితర నేతలకు ఇటీవలే సుప్రీంకోర్టు బెయిల్ ని మంజూరు చేసిన విషయం అందరికీ తెలిసిందే. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ నేతృత్వంలో కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా కోర్టు విచారణలు కొనసాగుతున్నాయి.

## షార్ట్ సర్క్యూట్.. ఏడేళ్ల బాలుడు సజీవ దహనం !

కరీంనగర్, అక్టోబర్ 4 : కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఈదుల గట్టెపల్లిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇంట్లో నిద్రిస్తున్న ఏడేళ్ల బాలుడు సజీవ దహనమయ్యాడు.

గ్రామంలో నివాసముంటున్న అంగిడి అనితరాజు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇంట్లో నిద్రిస్తున్న వారి కుమారుడు అంగిడి సాయికుమార్ (7) మంటల్లో సజీవ దహనమయ్యాడు. సాయికుమార్ కరీంనగర్ వసంత్ వలీ పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. బాలుడు సజీవ దహనం కావడంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.

# గ్రూప్-1 నోటిఫికేషన్‌పై తీర్పు రిజర్వ్.. అభ్యర్థుల్లో ఉత్కంఠ

హైదరాబాద్, అక్టోబర్ 4 : గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. గ్రూప్-1 నోటిఫికేషన్‌పై దాఖలైన వివిధ పిటిషన్ల విచారణను హైకోర్టు పూర్తి చేసింది. తీర్పును రిజర్వ్ చేసింది హైకోర్టు. దీంతో గ్రూప్-1 అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

కీ, రీ నోటిఫికేషన్, ఎస్టీ రిజర్వేషన్ ప్రకారం మెరిట్ జాబితాను మళ్లీ విడుదల చేయాలని పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

ఈ పిటిషన్లపై కోర్టు విచారణ పూర్తి చేసింది. అన్ని అభ్యంతరాలను పరిశీలించాకే తుది కీని విడుదల చేశామని టీజీపీఎస్సీ కోర్టుకు తెలిపింది. ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఉండడంతో ఈ కేసు విచారణకు హైకోర్టు ప్రాధాన్యత ఇచ్చింది.

563 పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. జనరల్ పోస్టులు 200, ఈడబ్ల్యూఎస్ 49, బీసీ(ఏ) 44, బీసీ (బీ)37, బీసీ(సీ) 13, బీసీ(డీ) 22, బీసీ(ఈ) 16, ఎస్సీ 93, ఎస్టీ 52, క్రీడాకారులు 4, దివ్యాంగులు 24 పోస్టులు చొప్పున ఉన్నాయి. అన్ని క్యాటగిరీలకు 1:50 నిష్పత్తి ఎంపికలో సర్వీస్ కమిషన్ విఫలమైందని, రిజర్వేషన్ క్యాటగిరీ అభ్యర్థులకు నష్టం జరుగుతున్నదని పలువురు పేర్కొన్నారు.

# ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపిన నటుడు రజినీకాంత్..!



న్యూఢిల్లీ, అక్టోబర్ 4 : ఇటీవల అనారోగ్యానికి గురైన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత తొలిసారి అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. తన ఆరోగ్యం గురించి ప్రార్థించిన శ్రేయోభిలాషులకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీకి కూడా కృతజ్ఞతలు తెలియజేశారు.

'నా ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి, ఫోన్ చేసి పరామర్శించిన ప్రధాని నరేంద్రమోదీకి నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని రజినీకాంత్ పేర్కొన్నారు. తాను త్వరితగతిన కోలుకోవాలని ప్రార్థించిన తమిళనాడు సీఎం స్టాలిన్‌కు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

రజనీకాంత్ సెప్టెంబర్ 30న చెన్నైలోని ప్రముఖ ఆస్పత్రిలో చేరారు. గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళంలో వాపు ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. ట్రాన్స్‌కాథెటర్ పద్ధతి ద్వారా చికిత్స అందించి స్టెంట్ అమర్చారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఆయన్ని గురువారం రాత్రి డిశ్చార్జ్ చేశారు. కొన్ని వారాల పాటు విశ్రాంతి అవసరమని చెప్పారు.

ఇదిలావుంటే రజనీకాంత్ నటించిన 'వేట్టయాన్' అక్టోబర్ 10న విడుదల కానుంది. టీజే జ్ఞానవేల్ దీనికి దర్శకత్వం వహించారు. భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఎన్నో అంచనాలు ఉన్నాయి. అదేవిధంగా ఆయన 'కూలీ' కోసం వర్క్ చేస్తున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విశ్రాంతి అనంతరం రజనీకాంత్ ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొనే అవకాశం ఉంది.

# శ్రీశైలం ఆలయం గోకులంలో గ్రాస సమర్పణకు ఏర్పాట్లు : ఈవో పెద్దిరాజు



అమరావతి, అక్టోబర్ 4 : నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లికార్జునస్వామి చెంత గోవులకు గ్రాసాన్ని సమర్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో పెద్దిరాజు తెలిపారు. హేమారెడ్డి మల్లమ్మ మందిరం ఎదురుగా గోకులంలో సుమారు 40 అడుగుల విస్తీర్ణంలో దాతల సహకారంతో నూతనంగా గ్రాసం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

భక్తులు కూర్చునేందుకు వీలుగా గోకుంలోనూ, గోకుల పరిసర ప్రాంతంలోని పచ్చిక బయలు ప్రదేశంలో బెంచీలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మల్లమ్మ మందిరం ముందుభాగంలో మరిన్ని దేవతా వృక్షాలను నాటాలని సూచించారు. మల్లమ్మ మందిరం మెట్ల మార్గాన షెడ్లను, ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఆలయ అధికారులు నరసింహారెడ్డి, చంద్రశేఖర శాస్త్రి, తదితరులున్నారు.

# విశ్వజ్ఞాన వితరణశీలి సద్గురువే..!

**(05 అక్టోబర్ "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం" సందర్భంగా)**

బ్రహ్మ, విష్ణు, మహేశ్వర రూపాలన్నీ సమ్మిళితమై గురువుగా ఇలలో వెలసి మన ముందు నిస్వార్థ మార్గదర్శకులుగా ఉన్న సంగతి మనందరికీ తెలుసు. నడిచే పరబ్రహ్మగా ఉపాధ్యాయులు రాబోయే విశ్వ తరాలను నిర్మించే మహాయజ్ఞంలో తమ గురుతర బాధ్యతలను విస్మరించక, తమ జీవితాశయాలుగా మలుచుకొని సమాజ దశ దిశలకు బాటలు వేస్తున్నారు. ప్రపంచంలో గురువులేని వ్యక్తి ఉండరు. నిరక్షరాస్యుడి జీవితంలో కూడా తను నమ్మిన గురువు చూపిన మార్గంలో అడుగులు వేస్తారు. నేటి బాలలను రేపటి బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే నిస్వార్థ జీవులే గురువులు. అన్ని వృత్తులలోకెల్ల ఉపాధ్యాయవృత్తి అత్యంత గౌరవం కలిగినదిగా పేర్కొనబడింది. యువత సన్మార్గంలో నడవడానికి పునాదులు వేసే బాధ్యత తల్లితండ్రుల తరువాత ఉపాధ్యాయుడి మీదనే అధికంగా ఉంటుంది. అమ్మ, నాన్న తరువాత మూడో తల్లి/తండ్రిగా గురువును అభివర్ణిస్తారు.

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం-2023 నినాదం:

విశ్వవ్యాప్తంగా ఉపాధ్యాయుల పాత్రను అభినందించడం, కృతజ్ఞతలను తెలియజేయడం, స్మరించుకోవడం మరిచిపోరాదని 'ఐరాస' (ఐక్యరాజ్యసమితి)లోని అతిముఖ్య విద్యా శాఖ యునెస్కో (యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్) 05 అక్టోబర్ 1966న తీసుకున్న నిర్ణయం ప్రకారం 1994 నుండి ప్రతియేటా 05 అక్టోబర్ రోజున "ప్రపంచ/అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం" పాటించడం జరుగుతుంది. శిశు తరగతి నుండి ఉన్నత విద్య వరకు అధ్యాపకుడి భూమిక ప్రతి దశలో ఉంటుంది. "ప్రపంచ ఉపాధ్యాయ దినం-2023" నినాదంగా "ఉపాధ్యాయులే జ్ఞాన వితరణశీలురు - ఉపాధ్యాయుల కొరతను తగ్గిద్దాం" తీసుకొని, ఉపాధ్యాయుల బోధనాపద్ధతిలో వచ్చిన ఆధునిక అనివార్య మార్పులను సవాలుగా తీసుకొని చక్కని బోధనలు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. కొన్ని సందర్భాలలో తల్లితండ్రులు చెప్పే విషయాలను కూడా నమ్మని పిల్లలు గురువుల బోధనలను తూచాతప్పక గుడ్డిగా నమ్ముతారనేది వాస్తవం.

ఆధునిక బోధనా పద్ధతుల ఆకలింపు:

అంతర్జాతీయ స్థాయి విషయ పరిజ్ఞానాన్ని స్వంతం చేసుకొని, ఆధునిక బోధనా పద్ధతులను ఆకలింపు చేసుకొని, పిల్లల మానసిక స్థితిని పసిగడుతూ ఆకర్షణీయ బోధన చేసే విధంగా శిక్షణ తీసుకోవడం లాంటివి ఉపాధ్యాయుల కనీస అవసరాలుగా ప్రపంచదేశాలు భావిస్తున్నాయి. యువతలో విద్యాప్రమాణాలు పెరగాలన్నా, నాణ్యమైన బోధనలు జరగాలన్నా ఉపాధ్యాయులకు ఉన్నత స్థాయి శిక్షణలు తప్పనిసరియని దేశాలన్నీ గుర్తించాయి. స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడంతో మాత్రమే మన రేపటి యువత అంతర్జాతీయ వేదికల్లో రాణించగలుగుతారు.

మారుతున్న జీవనశైలి, వెల్లువెత్తుతున్న శాస్త్రసాంకేతికత, విశ్వమే కుగ్రామం అయిన రోజులు, కరోనా విజృంభనతో విద్యాలయాలు మూతపడడంలాంటి పెను సవాళ్ళ మధ్య విద్యాబోధన ప్రక్రియ ప్రమాదంలో పడుతున్నది. వైజ్ఞానిక విప్లవ విస్పోటనానికి అనుగుణంగా ఉపాధ్యాయులు నవీన కొత్త పోకడలను అవగాహన చేసుకొని, తరగతి గదిని ఆటపాటల వేదికగా, ఆసక్తికర బోధనా పద్ధతులను ఆశ్రయించాల్సి ఉన్నది. విపత్తు నిర్బంధనల నడుమ ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ బోధనలకు అలవాటు పడుతూ, విద్యార్థులను ఆకర్శించాల్సిన బాధ్యత గురువుల మీదనే ఉంది.

జీవిత పాఠాల బోధనలు:

ఉపాధ్యాయులు నిర్వహించే పలు బాధ్యతలలో ఒకటి పాఠ్యాంశాల బోధన మాత్రమే కాదు. దీనికి తోడుగా గురువు మంచి స్నేహితుడిగా, మూడో తల్లి/తండ్రిగా, మేధావిగా, మార్గదర్శిగా, ప్రేరకుడుగా, తప్పదుగులను సవరించే హితుడిగా, సరైన జీవనశైలిని నేర్పే అన్నగా, ఆటపాటల్లో తమ్ముడిగా, పరిపాలనాదక్షుడిగా, సన్మార్గాన్ని చూపే ఆదర్శమూర్తిగా, మంచి సలహాదారుగా, జీవనతత్వాన్ని రుచిచూపే తత్వవేత్తగా అనేక పాత్రలను ఏకకాలంలో నిర్వర్తించాలి. సుఖ జీవనానికి తగు జీతాన్ని, జీవించే కళను నేర్పడమే ఉపాధ్యాయుల బాధ్యత అని అర్థం చేసుకోవాలి. సమాజానికి డాక్టర్, యాక్టర్, లాయర్, ఇంజనీర్, రాజకీయ నాయకుడు, వ్యాపారి, ఆదర్శ ఉద్యోగి, కలెక్టర్, పోలీస్ లాంటి అన్ని వృత్తుల వారిని తయారు చేసే మేధో వితరణ మనోబల యంత్రమే ఉపాధ్యాయుడని మనకు తెలుసు.

ఉపాధ్యాయుల ఉన్నత లక్షణాలు:

తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులుగా, స్పష్టతతో వివరించే వారు మంచి ఉపాధ్యాయులుగా, నేర్చుకుంటూ ఎదగాలనే ప్రేరణ కలిగించే వారు ఉత్తమ ఉపాధ్యాయులుగా సమాజంలో పేరు తెచ్చుకుంటారు. విద్యార్థుల్లో నిగూఢంగా దాగివున్న అభిరుచులు, ఆసక్తులను సున్నితంగా విశ్లేషించి, వారి ఎదుగుదలకు నిచ్చెనలా నిలబడగలిగిన వ్యక్తి గురువు ఒక్కరే. ఉపాధ్యాయుడిలో క్రమశిక్షణ, జ్ఞాన సంపన్నత, మార్గనిర్దేశనం, నిర్వాహకయుక్తి, అంకితభావం, కరుణ, బోధనాభిరుచి, అవగాహనా సామర్థ్యం, ఓపిక, ఆదర్శంగా నిలవడం, నియంత్రణాశక్తి, శ్రమించే తత్వం, సంభాషణా చాతుర్యం, జ్ఞాన వితరణలో ఆసక్తి లాంటి ఉన్నత లక్షణాలు ఉండడం తప్పనిసరి అని గురువు నమ్ముతాడు. సమాజానికి వెన్నుముఖగా నిలబడగలిగిన వారే గురుబ్రహ్మలు. దేశ ఆర్థిక సామాజిక నైతిక అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది. వనరుల కేంద్రం, కనిపించే ధైర్యం, నడిసొచ్చే దైవం, నైపుణ్య కొండ, వ్యక్తిత్వ వికాస అండ, విజ్ఞాన నిధి, శ్రేయస్సును కోరే పెన్నిధి, అనంత విశ్వాసాల సన్నిధిగా గురువు బహుముఖ పాత్రలలో ఒదిగి, సమాజ ఎదుగుదలకు ఉత్ప్రేరకంగా నిలిచే నిస్వార్థజీవి ఉపాధ్యాయుడు మాత్రమే. ఉపాధ్యాయులు వృత్తిలో అలసత్వం వహిస్తే, రాబోయే తరాల పునాదులు కదిలి, బలహీనపడి, సమాజం అల్లకల్లోలం అవుతుందని మరువరాదు. నేటి ఆధునిక వేగవంతమైన డిజిటల్ ప్రపంచంలో ఉపాధ్యాయులు తమ విధులను విస్మరించక, విలువల బీజాలను లేత మనస్సుల్లో నాటి, మేధో మహా వృక్షాలుగా ఎదిగేలా సాధన చేసి, విశ్వశాంతికి, నవ్య ప్రగతికి బాటలు వేయాలని ఆశిద్దాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రూ.10,000ల కోట్ల విలువైన పలు పారిశుధ్య, పరిశుభ్రతా ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 4 : పరిశుభ్రత కోసం అత్యంత ముఖ్యమైన సామూహిక ఉద్యమాల్లో ఒకటైన స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గాంధీ 155వ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ స్వచ్ఛభారత్ దివస్ 2024 కార్యక్రమం నిర్వహించారు. అమృత్, అమృత్ 2.0, నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, గోబర్ధన్ పథకాల కింద పలు ప్రాజెక్టులతో పాటు మొత్తం రూ. 9600 కోట్ల విలువైన అనేక పారిశుధ్య, పరిశుభ్రతా ప్రాజెక్టులను ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ మోదీ శంకుస్థాపన చేసి, ప్రారంభించారు. 'స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' ఈ ఏడాది స్వచ్ఛతా హి సేవా నినాదం అని తెలిపారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, పూజ్య బాపూజీ, లాల్ బహదూర్ శాస్త్రీజీ జయంతి సందర్భంగా వారికి నివాళు లర్పించారు. మహాత్మా గాంధీ, ఇతర మహానుభావుల కలలను ఐక్యంగా సాకారం చేసుకునే దిశలో నేటి సందర్భం స్ఫూర్తిదాయకమని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

అక్టోబర్ 2న భావోద్వేగాలతో తన మనస్సు నిండిపోయినా తాను మాత్రం బాధ్యతలు నిర్వర్తించుటపైనే దృష్టి నిలిపినట్లు ప్రధాన మంత్రి తెలిపారు. స్వచ్ఛ భారత్ అభియాన్ 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, "స్వచ్ఛ భారత్ మిషన్ ప్రయాణం కోట్లాది మంది భారతీయుల అచంచలమైన నిబద్ధతకు నిదర్శనం" అని ప్రధాన మంత్రి అన్నారు. గత 10 ఏళ్లలో ఈ ఉద్యమానికి లభించిన ప్రజల మద్దతును ప్రధానంగా ప్రస్తావించిన ఆయన దేశంలోని ప్రతి పౌరుడు తమ స్వంత మిషన్‌గా దీనిని వారి జీవితంలో భాగం చేసుకున్నారని అన్నారు. స్వచ్ఛ భారత్ 10 ఏళ్ల వైలురాయి సందర్భంలో, దీనిని భారీ ప్రజా ఉద్యమంగా మార్చడంలో సఫాయిమిత్రలు, మత పెద్దలు, క్రీడాకారులు, సెలబ్రిటీలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా చేస్తున్న కృషిని ప్రధాని ప్రశంసించారు. మునుపటి, ప్రస్తుత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సైతం శ్రమదానం రూపంలో స్వచ్ఛ భారత్ కోసం సహకారాన్ని అందించి దేశ ప్రజలకు ప్రేరణ కలిగించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలు, నగరాలు, కాలనీల్లో నేడు జరుగుతున్న అనేక పరిశుభ్రతా కార్యక్రమాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు. రాష్ట్ర మంత్రులు, నాయకులు, ప్రజాప్రతినిధుల చురుకైన భాగస్వామ్యాన్ని కొనియాడారు. ఈ స్వచ్ఛతా పఖ్వాడా ఎడిషన్‌లో కోట్లాది మంది స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాలుపంచుకున్నారని ప్రధాని శ్రీ మోదీ తెలిపారు. 15 రోజుల సేవా పఖ్వాడాలో 28 కోట్ల మంది ప్రజల భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా 27 లక్షలకు పైగా కార్యక్రమాలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. మన దేశాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం కృషి చేయవలసిన అవసరాన్ని వివరించిన ప్రధానమంత్రి, దేశ పౌరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి ముఖ్యమైన సందర్భంలో, దాదాపుగా రూ. 10,000 కోట్లతో పరిశుభ్రతకు సంబంధించి అనేక ప్రాజెక్టులను ప్రారంభించినట్లు ప్రధానమంత్రి ప్రస్తావించారు. 'మిషన్ అమృత్'లో భాగంగా అనేక నగరాల్లో నీరు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నమామి గంగే, సేంద్రీయ వ్యర్థాలను బయోగ్యాస్‌గా మార్చే గోబర్ధన్ ప్రాజెక్ట్ వంటివి స్వచ్ఛ భారత్ మిషన్‌ను ఉన్నత శిఖరాల దిశగా నడిపిస్తాయని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. "స్వచ్ఛ భారత్ మిషన్ ఎంత విజయవంతమైతే, మన దేశం అంతగా ప్రకాశిస్తుంది" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

1000 ఏళ్ల తర్వాత కూడా భారతదేశంపై అధ్యయనం జరిగితే అప్పుడు సైతం స్వచ్ఛభారత్ మిషన్ గుర్తుకు వస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. "ప్రజల భాగస్వామ్యం, ప్రజల నాయకత్వంతో స్వచ్ఛభారత్ మిషన్ ఈ శతాబ్దపు అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ప్రజా ఉద్యమం"గా మారిందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ మిషన్ ప్రజల నిజమైన శక్తిసామర్థ్యాలను తనకు తెలిసేలా చేసిందన్నారు. పరిశుభ్రత తనకు ప్రజల శక్తి ఏమిటో చూపిందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. స్వచ్ఛతా అభియాన్‌ను ప్రారంభించిన సమయంలో లక్షలాది మంది దీనికోసం చేతులు కలిపారన్నారు. వివాహాలు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వేడుకలు సహా అన్ని చోట్లా పరిశుభ్రత సందేశాన్ని ప్రభావవంతంగా వ్యాప్తి చేశారని ప్రధాన మంత్రి గుర్తు చేసుకున్నారు. మరుగుదొడ్డి నిర్మించుకోవడం కోసం నాటి కాలంలో కొందరు తల్లులు తమ పశువులను అమ్ముకోగా, కొంతమంది మహిళలు తమ మంగళసూత్రాన్ని కూడా అమ్ముకున్నారనీ, అలాగే ఇంకొంతమంది తమ భూమిని సైతం అముకున్న ఘటనలు సైతం ఉన్నాయన్నారు. అయితే నేడు పరిశుభ్రత మిషన్ కోసం కొంతమంది రిటైర్డ్ టీచర్లు తమ పింఛను విరాళంగా ఇచ్చారని, కొంతమంది రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది తమ పదవీ విరమణ ప్రయోజనాలను విరాళంగా ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి విరాళం ఏదైనా ఆలయానికో, ఏదైనా కార్యక్రమం కోసమో ఇస్తే, అది వార్తాపత్రికల్లో ప్రధాన శీర్షికగా ఉండేదని ప్రధాని వ్యాఖ్యానించారు. టీవీల్లో ఎప్పుడూ వారి ముఖం చూపించకపోయినా, పత్రికల్లో వారి పేరు ఎక్కడా ప్రచురించకపోయినా ఈ మిషన్‌ను విజయవంతం చేయడం కోసం తమ డబ్బు, విలువైన సమయాన్ని విరాళంగా ఇచ్చిన లక్షలాది మంది ప్రజలు ఉన్నారనే సత్యం దేశం తెలుసుకోవాలని ఆయన అన్నారు. ఈ సంఘటలు భారత ప్రజల వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం మానేయాలని తాను ఇచ్చిన స్పష్టమైన పిలుపుతో స్పందించిన ప్రజలంతా దుకాణాలకు జనుము, బట్ట సంచులతో వెళ్లే సంప్రదాయాన్ని ప్రారంభించి మంచి కార్యక్రమానికి మద్దతునిచ్చిన విషయాన్ని శ్రీ మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ చొరవకు సహకరించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి పరిశ్రమలకు అలాగే దేశ ప్రజలందరికీ చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు. దీనికోసం తమవంతు సహకారం అందించిన అన్ని రాజకీయ పార్టీలకూ శ్రీ మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

సినిమాల రూపంలో పరిశుభ్రత సందేశాన్ని ప్రచారం చేయడంలో గత 10 ఏళ్లలో భారత చలనచిత్ర పరిశ్రమ కృషిని ప్రధాన మంత్రి గుర్తు చేసుకున్నారు అయితే ఇలాంటి పనిని ఒక్కసారి మాత్రమే కాకుండా ఒక తరం నుంచి మరొక తరం వరకూ కొనసాగించాలని సూచించారు. ప్రజల నేతృత్వంలో నిర్వహించిన పలు పరిశుభ్రతా కార్యక్రమాలను గురించి ప్రస్తావిస్తూ తన మన్ కీ బాత్ కార్యక్రమంలో దాదాపు 800 సార్లు పరిశుభ్రత అంశాన్ని ప్రస్తావించిన విషయాన్ని ఆయన ఉదహరించారు.

ఈ రోజు పరిశుభ్రత పట్ల ప్రజలు చేస్తున్న కృషిని ప్రధాన మంత్రి ప్రశంసించారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పరిశుభ్రత వైపు మార్గాన్ని చూపారు" అని ఆయన పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గత ప్రభుత్వాలు స్వచ్ఛత పట్ల నిర్లక్ష్యం వహించిన అంశాన్ని ఆయన లేవనెత్తారు.

మహాత్మాగాంధీని తమ రాజకీయ ప్రయోజనాల కోసం, ఓటు బ్యాంకు కోసం ఉపయోగించుకున్న వారు ఇప్పుడు ఆయన ఆశయాలను మరచిపోయారని విమర్శించారు. అపరిశుభ్రత, మరుగుదొడ్ల కొరతను జాతీయ సమస్యగా ఎప్పుడూ పరిగణించలేదన్నారు. ఫలితంగా సమాజంలో దీని గురించి చర్చలు జరగలేదనీ, మురికి ప్రజల జీవితంలో భాగమైపోయిందని ప్రధాని అన్నారు. ఎర్రకోట సాక్షిగా తాను ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాత అనేక విమర్శలు ఎదుర్కొన్న విషయాన్ని కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. "సాధారణ పౌరుల జీవితాలను సులభతరం చేయడం ప్రధానమంత్రి మొదటి ప్రాధాన్యం" అని ఆయన తెలిపారు. మరుగుదొడ్లు, శానిటరీ ప్యాడ్‌ల గురించి మాట్లాడటం తన బాధ్యత అని స్పష్టం చేశారు. దాని ఫలితాలు ఈరోజు చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

పదేళ్ల క్రితం వరకు దేశ జనాభాలో 60 శాతానికి పైగా ప్రజలు మరుగుదొడ్లు లేని కారణంగా బహిరంగ మలవిసర్జన చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇది మానవ ఆత్మగౌరవానికి విరుద్ధవేనదనీ, తరతరాలుగా దేశంలోని పేదలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వారి పట్ల అగౌరవాన్ని ఇది సూచిస్తుందని ప్రధాని అన్నారు. మరుగుదొడ్లు లేకపోవడం వల్ల తల్లులు, సోదరీమణులు అలాగే ఆడబిడ్డలు పడే ఇబ్బందులను ప్రస్తావించిన శ్రీ మోదీ, ఇది వారి ఆరోగ్యం, భద్రతకూ పెనుముప్పుగా పేర్కొన్నారు. బహిరంగ మలవిసర్జన వల్ల ఏర్పడే అపరిశుభ్రతతో చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఉందనీ, పిల్లల మరణాలకు ఇది ప్రధాన కారణంగా ఉందన్నారు.

ఇలాంటి దయనీయమైన పరిస్థితిలో దేశం కొనసాగడం కష్టమని భావించిన తాము పరిస్థితులు ఇలాగే కొనసాగకూడదని నిర్ణయించుకున్నామని శ్రీ మోదీ చెప్పారు. ఈ ప్రభుత్వం దీనిని జాతీయ, మానవ సవాలుగా పరిగణించి, పరిష్కారం కోసం స్వచ్ఛభారత్ ప్రచారాన్ని ప్రారంభించిందన్నారు. దీంతో స్వచ్ఛభారత్ మిషన్ కోసం బీజం పడిందన్నారు. అనతికాలంలోనే కోట్లాది మంది భారతీయులు అద్భుతాలు చేశారని ఆయన అన్నారు. దేశంలో 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించబడ్డాయనీ, గతంలో 40 శాతం కంటే తక్కువ ఉన్న మరుగుదొడ్ల వినియోగం 100 శాతానికి చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు.

దేశంలో సామాన్యుల జీవితాలపై స్వచ్ఛ భారత్ మిషన్ ప్రభావం అమూల్యమైనదని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వాషింగ్టన్, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, ఒహియో స్టేట్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు సంయుక్తంగా నిర్వహించిన ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ నుంచి ఇటీవలి అధ్యయనాన్ని ఉటంకిస్తూ, స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతియేటా 60 నుంచి 70వేల మంది పిల్లల ప్రాణాలను కాపాడుతున్న విషయం వెలుగులోకి వచ్చిందని శ్రీ మోదీ తెలిపారు. డబ్ల్యూహెచ్ఓ నివేదికను ప్రస్తావిస్తూ, 2014 నుంచి 2019 మధ్య కాలంలో ప్రాణాంతక అతిసారం బారిన పడి మరణించే 3 లక్షల మంది ప్రాణాలను కాపాడడం ఈ కార్యక్రమం వల్లే సాధ్యపడిందని తెలిపారు.

యునిసెఫ్ నివేదికలను ఉటంకిస్తూ, ఇంట్లో మరుగుదొడ్ల నిర్మాణం కారణంగా, ఇప్పుడు 90 శాతానికి పైగా మహిళలు సురక్షితంగా ఉన్నారనీ, ఈ స్వచ్ఛభారత్ మిషన్ కారణంగా మహిళల్లో ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే వ్యాధులు గణనీయంగా తగ్గాయని ఆయన స్పష్టం చేశారు. లక్షలాది పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించడం వల్ల బడిమానేసే విద్యార్థినుల సంఖ్య తగ్గిందని శ్రీ మోదీ తెలిపారు. యునిసెఫ్ నిర్వహించిన మరో అధ్యయనాన్ని ఉటంకిస్తూ, పరిశుభ్రత కారణంగా, గ్రామాల్లోని కుటుంబాలు గతంలో వ్యాధుల చికిత్స కోసం సగటున ప్రతియేటా ఖర్చు చేసే 50 వేల రూపాయలు ఇప్పుడు ఆదా అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ప్రజల్లో వచ్చిన అవగాహనను ప్రస్తావిస్తూ, గోరఖ్‌పూర్‌లో బ్రెయిన్ ఫీవర్ కారణంగా చిన్నారుల మరణాల సమస్యను ప్రజలు పరిశుభ్రతతో పరిష్కరించుకున్న సంఘటను ప్రధాన మంత్రి ఉదహరించారు.

పరిశుభ్రత ప్రతిష్ఠ పెరగడంతో దేశ ప్రజల ఆలోచనా విధానంలో భారీ మార్పు వచ్చిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. స్వచ్ఛ్ భారత్ మిషన్ వల్ల వారి ఆలోచనలో మార్పును గురించి ఆయన ప్రస్తావించారు అలాగే పారిశుధ్య కార్మికుల పట్ల గతంలో చిన్నచూపు ఉండేదన్నారు. "పారిశుధ్య కార్మికులకు గౌరవం లభించిన క్రమంలో వారు కూడా దేశాన్ని మార్చడంలో తమ పాత్ర గురించి గర్వంగా భావించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ లక్షలాది మంది సఫాయి మిత్రలకు గర్వకారణంగా నిలిచింది" అని పేర్కొన్నారు. సఫాయి మిత్రల గౌరవప్రదమైన జీవితం, భద్రత పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రధాన మంత్రి వివరించారు. సెప్టిక్ ట్యాంకుల్లో దిగి మురికి శుభ్రం చేయడం వంటి సమస్యల పరిష్కారం కోసం కృషి జరుగుతున్నదని తెలిపిన శ్రీ మోదీ, ఈ విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. "వృత్తినిపుణులు, అంకుర సంస్థలను ఈ విషయంగా పరిష్కారం కనుగొనేందుకు ప్రోత్సహిస్తున్నాం" అని ఆయన చెప్పారు.

స్వచ్ఛభారత్ అభియాన్ విస్తరణ పురోగతిని ప్రస్తావిస్తూ, శ్రీ మోదీ ఇది కేవలం పరిశుభ్రత కార్యక్రమం మాత్రమే కాదనీ, నేడు శ్రేయస్సు కోసం కొత్త మార్గాన్ని పరిశుభ్రత సృష్టిస్తోందని వ్యాఖ్యానించారు.

స్వచ్ఛ్ భారత్ అభియాన్ దేశంలో పెద్ద ఎత్తున ఉపాధిని కూడా కల్పిస్తోందని, గత కొన్నేళ్లుగా కోట్లాది మరుగుదొడ్ల నిర్మాణంతో అనేక రంగాలు లబ్ధి పొందాయనీ, ఎంతో మందికి ఉపాధి లభించిందని తెలిపారు. గ్రామాల్లో మేస్త్రీలు, ప్లంబర్లు, కూలీలు ఇలా చాలా మంది ఉపాధి పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మిషన్ వల్ల దాదాపు 1.25 కోట్ల మంది ప్రజలు ఏదో ఒక రూపంలో ఉపాధి పొందినట్లు యునిసెఫ్ అంచనా తెలిపినట్లు శ్రీ మోదీ పేర్కొన్నారు. నేటి తరం మహిళా మేస్త్రీలు స్వచ్ఛ భారత్ అభియాన్ కారణంగా సాధ్యమైన భారీ మార్పుగా అభివర్ణించిన ప్రధానమంత్రి, మన యువత సైతం క్లీన్-టెక్ ద్వారా మంచి ఉద్యోగావకాశాలను పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం క్లీన్-టెక్‌కు సంబంధించి దాదాపు 5 వేల అంకురసంస్థలు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. నీరు, పారిశుధ్య రంగంలో, వ్యర్థాల నుంచి సంపదను పొందడం, వృధా, వ్యర్థాలను సేకరించి, రవాణా చేయడం, నీటి పునర్వినియోగం, రీసైక్లింగ్ వంటి అనేక కొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ రంగంలో 65 లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నామని, స్వచ్ఛభారత్ మిషన్ ఇందులో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

"స్వచ్ఛ భారత్ మిషన్ భారతదేశంలో సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇచ్చింది", గృహాల నుంచి ఉత్పత్తయ్యే వ్యర్థాలు ఇప్పుడు విలువైన వనరులుగా మారుతున్నాయని ప్రధాన మంత్రి తెలిపారు. గృహ వ్యర్థాల నుంచి కంపోస్టు, బయోగ్యాస్, విద్యుత్, రోడ్డు నిర్మాణానికి వినియోగించే చార్‌కోల్ వంటి పదార్థాలు తయారవుతున్నాయన్నారు




# జగన్మాత అనుగ్రహంతో ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలి- ఎంపి కేశినేని చిన్ని

## –అమ్మవారిని దర్శించుకున్న అమలాపురం ఎంపీ



అమరావతి, అక్టోబర్ 4 : : వరద విపత్తు కారణంగా కలిగిన నష్టం నుంచి, ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో త్వరగా కోలుకుని ఆర్థికంగా పూర్వస్థితికి రావాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ గాయత్రి దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని అమలాపురం ఎంపీ జి.ఎం. హరీష్ తో కలిసి దర్శించుకున్నారు.

ఆ తర్వాత ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ? భక్తులందరికి ముందుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. జగన్మాత అనుగ్రహంతో రాష్ట్ర ప్రభుత్వం, తెలుగు రాష్ట్ర ప్రజలందరూ ఆర్థికంగా పురోభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనం కోసం విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

దసరా ఏర్పాట్లు అద్భుతంగా నిర్వహించిన అన్ని ప్రభుత్వ విభాగాలను అభినందించారు. ఎంపీ జి.ఎమ్.హరీష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై వుండాలని ప్రార్థించినట్లు తెలిపారు. సాధారణ భక్తులకు అవసరమైన ఏర్పాట్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదన్నారు. ప్రతి అంశంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని వివరించారు.

# హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం - హరీశ్ రావు

**–నిరుపేదల ఇళ్లు కూలిస్తే సహించబోమన్న ఎమ్మెల్యే హరీష్**
**–తొర్రూర్‌లో రైతుల ధర్నాకు సంఘీభావం**
**–రైతు డిక్లరేషన్ పేరుతో రేవంత్ మోసం**
**–ఉపాధి హామీ నిధులు సైతం పక్కదారి**
**రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తుందన్న హరీష్**

మహబూబాబాద్, అక్టోబర్ 4 : హైదరాబాద్ మహా నగరంలో చెరువుల సంరక్షణ పేరుతో 'హైడ్రా' విధ్వంసం సృష్టిస్తోందని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికి కక్షపూరితంగా ప్రభుత్వం నిరుపేదల ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్నారని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చితే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని వార్నింగ్ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రైతులు నేడు చేపట్టిన ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతు రుణమాఫీని భేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తానని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ లో ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం అమలవుతోందని ఆయన ఫైర్ అయ్యారు.

### ఉపాధి హామీ నిధులు ఎక్కడ ..

ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.12 వేల హామీ ఏమైందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. మూతపడిన చెక్కర కర్మాగారాలను తెరిపిస్తామని, పసుపు బోర్డును తీసుకొస్తామంటూ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇక భూమి లేని నిరుపేద రైతులకు రూ.5 లక్షల రైతు భీమా పత్తా లేకుండా పోయిందని ఆరోపించారు. దసరాలోపు ప్రభుత్వం రైతుబంధు నిధులు విడుదల చేయాలని.. ఎకరానికి రైతల ఖాతాల్లో రూ.7,500 జమ చేయాలన్నారు.

### మహిళలకు కరువైన భద్రత

రాష్ట్రంలో బాలికలు, మహిళలకు భద్రత కరువైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు.

భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు

. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



### ఎక్కడో ఒక చోట లైంగిక దాడి ఘటనలు

ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట లైంగిక దాడి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని హరీశ్‌రావు అన్నారు .

ఇద్దరు మైనర్ బాలికలపై జరిగిన లైంగిక దాడి ఘటన వార్త తనను తీవ్రంగా కలచివేసిందన్నారు.

హోం మంత్రిత్వ శాఖను కూడా తానే నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఇందిరమ్మ రాజ్యం అని ఊదరగొట్టడమే కానీ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలో మహిళలకు భద్రత లేదని తేటతెల్లమయిందంటూ విమర్శించారు.

### గత ప్రభుత్వ హయాంలో మహిళల భద్రతకు ప్రాధాన్యత

గత ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని హరీశ్ పేర్కొన్నారు. షీ టీమ్స్, సఖి భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి భద్రత కల్పించిందని, కానీ ఇందిరమ్మ రాజ్యం అని ఊదరగొట్టడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలో మహిళా భద్రత లేదని తేటతెల్లమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి శాంతి భద్రతల పర్యవేక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు.

మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని డిమాండ్ చేశారు.

